ఐఐటీహెచ్‌లో ఎలాన్-ఎన్విజన్

కంది, ఫిబ్రవరి 14: కందిలోని ఐఐటీ హైదరాబాద్ ఎలాన్-ఎన్విజన్ 2025 వేడుకలకు సిద్ధమవుతుంది. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న ఎలాన్ వేడుకలకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రోజులపాటు జరిగే కార్యక్రమాల్లో పేరుగాంచిన లెజెండరీ సాపోన్ కలిసి డీజే స్వాట్రిక్స్, సంగీతం, క్లాసికల్ -ఫ్యూజన్ తదితర ప్రదర్శనలు ఉంటాయి. ఈ సందర్భంగా ఐఐటీ హెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జరిగే ఎలాన్ వేడుకలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయన్నారు. ఇందులో పాల్గొనే వారి సంఖ్య ప్రతిఏటా పెరిగి ఆకర్షిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ మనస్సులను ఒకచోట చేర్చే డైనమిక్ వేదికగా ఈ ఎలాన్ నిలుస్తుందని తెలిపారు. ఐఐటీహెచ్ స్టూడెంట్స్ డీన్ ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ.. ఎలాన్-ఎన్విజన్ అనేది కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదని, ఇది సృజనాత్మకత, సహకారం, ఆవిష్కరణల వేడుక అన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి, నూతన ఆలోచనలతో ప్రయోగాలు చేసేందుకు, మార్పును ప్రేరేపించే అర్థవంతమైన చర్చల్లో పాల్గొనడానికి ఇది ఒక వేదికవుతుందన్నారు. వినోదంతోపాటు వివిధ కార్యకలాపాలు, పోటీల ద్వారా స్ఫూర్తినిచ్చే విద్యావంతులను అందించే ఫెస్ట్ అని తెలిపారు.

అంతర్జాతీయ సదస్సు ముగింపు ఉత్సవంలో పాల్గొన్న ప్రతినిధులు

గీతంలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 14:గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ, హైదరాబాద్‌లో ఈనెల 12నుంచి 14వరకు ఫార్మాస్యూటికల్, ఆరోగ్య శాస్త్రాల్లో సమగ్ర ధోరణులు అనే అంశంపై నిర్వహించిన మూడురోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ప్రపంచ ఔషధ, ఆరోగ్య సంరక్షణ రంగంలో వస్తున్న మార్పులు, పరిశోధనలపై చర్చలు జరిగాయి. చివరి రోజున సదస్సులో ఐఈఎఫ్ఆర్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఉదయ్ సక్సేనా, ఎన్వేద థెరప్యూటిక్స్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీకాంత్ రామచంద్రన్, దక్షిణకొరియా నుంచి ప్రొఫెసర్ గంగరాజు గెడ్డా, పుణె నుంచి ప్రొఫెసర్ చిన్నోయ్ పాత్రా వంటి ప్రఖ్యాత నిపుణులు ఆరోగ్య సంరక్షణ, ఔషధ ఆవిష్కరణల భవిష్యత్తుపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. సదస్సు నిర్వాహకుడు డాక్టర్ ప్రతీక్‌పాఠక్ మాట్లాడుతూ..సదస్సుకు 60కి పైగా మౌఖిక ప్రదర్శనలు, వందకుపైగా పోస్టర్ ప్రదర్శనలు,15మంది నిపుణుల ఉపన్యాసాలు జరిగినట్లు తెలిపారు. విద్యా, శాస్త్రీయ అంశాలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ప్రపంచ జ్ఞాన సమ్మేళనంగా నిలిచిన ఈ సదస్సులో అమెరికా, క్రొయోషియా, మలేషియా, శ్రీలంక, దక్షిణ కొరియా నుంచి విభిన్న శ్రేణి వక్తలు పాల్గొన్నారని వివరించారు. ఆరోగ్య సంరక్షణ, ఔషధ పురోగతిపై సార్వత్రిక ఔచిత్రాన్ని, పెరుగుతున్న ఆసక్తిని వివరించిందన్నారు. గొప్ప చర్చలు, కొత్త ఆలోచనలు, పరిశ్రమ భవిష్యత్తును రూపొందించే సవాళ్లు, అవకాశాల గురించి లోతైన అవగాహనను పెంపొందించినట్టు పేర్కొన్నారు. ఓరల్, పోస్టర్ ప్రజెంటేషన్ విజేతలకు బహుమతులు, వారిని ఎంపిక చేసిన ప్యానల్‌కు జ్ఞాపికలు అందజేసినట్లు తెలిపారు.

జహీరాబాద్ మండలం హోతికే శివారులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇండ్లు అప్పగించాలి

జహీరాబాద్, ఫిబ్రవరి 14:నిరుపేదలకు ఇండ్లు అందించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇండ్లను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని జహీరాబాద్ పట్టణ, మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆదేశాల మేరకు శుక్రవారం బీఆర్ఎస్ పట్టణ, మండల నాయకులు జహీరాబాద్ మండలంలోని హోతికే శివారులోని డబుల్ డబుల్‌బెడ్రూం ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హోతికే గ్రామ శివారులో పది ఎకరాల్లో రూ.36 కోట్లతో 660 ఇండ్లను నిర్మించిందన్నారు. 2023 అక్టోబర్ 7న అప్పటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి తన్నీరు హరీశ్‌రావు, జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణికరావు కలిసి ఇండ్లను ప్రారంభించి, రాజకీయాలకు అతీతంగా లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసి ఇండ్ల పట్టా సర్టిఫికెట్లు అందజేశారని పేర్కొన్నారు. రెండేండ్లు గడిచినా లబ్ధిదారులకు డబుల్ డబుల్‌బెడ్రూం ఇండ్లను నేటికీ అప్పగించలేదన్నారు. డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టా సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. అసంపూర్తిగా మిగిలిన డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణ పనులను చేపట్టడంలో సంబంధిత శాఖాధికారుల పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. రెండేండ్లుగా ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయడంతో అధికారుల నిర్లక్ష్యం ధోరణిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత శాఖాధికారులు వెంటనే చర్యలు తీసుకొని అసంపూర్తిగా ఉన్న ఇండ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ్, యాకుబ్, బండి మోహన్, అబ్దుల్లా, మంజూల, రాకేశ్, ప్రభుయాదవ్, గణేశ్, నరేశ్‌రెడ్డి, జాకీర్ పాల్గొన్నారు.



న్యాల్‌కల్‌లోని జడ్పీహెచ్ఎస్‌లోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అబ్జర్వర్ సోమేశ్వర్‌రావు

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

జహీరాబాద్, ఫిబ్రవరి 14: ఈనెల 27న జరిగే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అబ్జర్వర్, ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి సోమేశ్వర్‌రావు సంబంధిత మండల అధికారులను ఆదేశించారు. శుక్రవారం న్యాల్‌కల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ అధికారులు, సిబ్బందితో పాటు ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. ఆయనవెంట తహసీల్దార్ భూపాల్, ఆర్ఐ శ్యాంరావు, పంచాయతీ కార్యదర్శి ధన్‌రాజ్ ఉన్నారు.

డంపింగ్ యార్డు అనుమతులు రద్దు చేయించాలి

కోదండరాంకు వినతి పత్రం అందజేస్తున్న నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల యువకులు

గుమ్మడిదల, ఫిబ్రవరి14:రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి డంపింగ్ యార్డు అనుమతులు రద్దు చేయించాలని నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల ప్రజలు తెలంగాణ జన సమితి వ్యవస్థాపకుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను కోరారు. శుక్రవారం ప్యారానగర్ డంపింగ్ యార్డు వల్ల తీవ్ర ఇబ్బందులు పడే బాధిత గ్రామాల ప్రజలు ఎమ్మెల్సీని కలిసి తమ బాధలను తెలియజేశారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి డంపింగ్ యార్డు వల్ల ఇక్కడి రైతులు, ప్రజల బాధలను ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఆ గ్రామాల యువకులు విజయ్‌కుమార్, మల్లేశ్ గౌడ్, శ్రీనివాస్, సురేశ్, రామకృష్ణ, శేఖర్, రాజు గౌడ్, చంద్రయ్య, ప్రభు, రాజు తెలిపారు.

కాంగ్రెస్‌కు పాలించే సత్తా లేదు

- ప్రజలు వెంటపడి కొట్టే రోజులు రాబోతున్నాయి...
- గాలికి వదిలేసిన ఆరు గ్యారెంటీలు
- ప్రభుత్వానికి దమ్ముంటే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలి
- అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

బీఆర్ఎస్ డైరీని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

మునిపల్లి, ఫిబ్రవరి 14: ఎన్నికల సమయంలో ఇచ్చిన దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు వెంటపడి కొట్టే రోజులు దగ్గర పడ్డాయని, కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలించే సత్తా లేదని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. శుక్రవారం ఖమ్మంపల్లి శివారులోని శ్రీసాయి గార్డెన్‌లో బీఆర్ఎస్ నూతన క్యాలెండర్, డైరీ ఆవిష్కరించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నేరవేర్చే సత్తా లేనప్పుడు ఎన్నికల్లో ప్రజలకు తప్పుడు హామీలు ఎందుకు ఇచ్చారో ప్రజలకు చెప్పాలన్నారు. కేసీఆర్ హయాంలో రైతులు సుఖసంతోషాలతో పంటలు పండించుకున్నారన్నారు. రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని, సగమందికి చేసి గొప్పలు చెప్పుకోవడం ఎందుకని ప్రశ్నించారు. రైతులకు పెట్టుబడి కోసం ఎకరాకు 12వేలు అందిస్తాం అని గొప్పలు చెప్పి రూ.6వేలు ఇస్తామనడం సిగ్గుచేటన్నారు.

కాంగ్రెస్‌కు రోజులు దగ్గర పడ్డాయి...

రాష్ట్రంలో కాంగ్రెస్‌కు రోజులు దగ్గర పడ్డాయని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ముందుకు సాగాలని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ పిలుపునిచ్చారు. కాంగ్రెసోళ్లు బీఆర్ఎస్ నాయకులపై పెట్టే తప్పుడు కేసులకు భయపడొద్దన్నారు. బీఆర్ఎస్‌కు మంచి రోజులు రాబోతున్నాయని చెప్పారు.

ప్రజల్లోకి పోయేందుకు భయపడుతున్న కాంగ్రెస్

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లేందుకు కాంగ్రెస్ భయపడుతూ, ఎన్నికలు నిర్వహించడంలో అలస్యం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. ఎన్నికలు ఎప్పుడు పెట్టినా కాంగ్రెస్‌కు ప్రజలు ఓటుతో తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కాంగ్రెస్‌కు పాలించే దమ్ము ఉంటే రాష్ట్రంలో తక్షణమే ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జైపాల్‌రెడ్డి, సాయికుమార్, మాజీ జడ్పీటీసీ మీనాక్షీసాయికుమార్, ప్రధాన కార్యదర్శి శశికుమార్, మైనార్టీ అధ్యక్షుడు మౌలానా, యువత అధ్యక్షుడు అనంద్ రావుతో పాటు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గౌరీశంకర్‌గౌడ్ కుటుంబానికి అండగా ఉంటాం

బొంతపల్లిలో బీఆర్ఎస్ నాయకుడు గౌరీశంకర్‌గౌడ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, చింతా ప్రభాకర్

గుమ్మడిదల, ఫిబ్రవరి14: ఉద్యమంలో కీలకపాత్ర పోషించి రాష్ట్ర ఏర్పాటు వరకు అలుపెరుగని పోరాటం చేసిన రోజులు గుర్తుకొస్తున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు జరిగిన తర్వాత ఎమ్మెల్యేలను గెలిపించుకోవడంలో ఉమ్మడి జిన్నారం మండలంలో క్రియాశీలకంగా వ్యవహరించిన గౌరీశంకర్ గౌడ్ ఇక లేడంటే నమ్మలేకున్నానని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. మాజీ మంత్రి హరీశ్‌రావుతోపాటు ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీసీబీ జిల్లా చైర్మన్ శివకుమార్, సీనియర్ నాయకుడు జైపాల్‌రెడ్డి శుక్రవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. గౌరీశంకర్ కుటుంబానికి పార్టీతోపాటు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎంబీబీఎస్‌కు అవాంతరాలు రాకుండా చూస్తానని గౌరీశంకర్‌గౌడ్ కూతురుకు హామీ ఇచ్చారు. పార్టీకి గౌరీశంకర్‌లేని లోటు తీర్చలేనిదన్నారు. వీరితోపాటు నాయకులు వెంకటేశంగౌడ్, గోవర్ధన్‌రెడ్డి, ప్రబాకర్‌రెడ్డి, సంతోశ్‌రెడ్డి, నరహరి, అమ్మన్నగారి శేఖర్ ఉన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రెవెన్యూ అధికారి రాధికారమణి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి రాధికారమణి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 14:యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి రాధికారమణి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై నార్కోటిక్ కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు లోనుకాకుండా దూరంగాఉండాలని, ఆ దిశగా అనుబంధ శాఖల అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి సాగు చేస్తే శిక్షకు గురవుతారని రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలను అమ్మేవారి సమాచారం అందించాల్సిన బాధ్యత పౌరులపై ఉన్నదన్నారు. బస్సులు, వాహనాలను విధిగా తనిఖీ చేయాలని, సరిహద్దుల్లో గట్టి నిఘా పెట్టాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా జిల్లాలోని కళాశాలలు, పాఠశాలలు, గ్రామాల్లో వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా ఎక్సైజ్ అధికారి నవీన్ చంద్, డీఎస్పీ సత్యనారయణ గౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లపై స్పెషల్ డ్రైవ్

ఇంటింటికెళ్లి ఆస్తి పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

జిన్నారం, ఫిబ్రవరి 14: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో 100శాతం ఆస్తిపన్ను వసూలు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, ఆర్వో నర్సింహులు తెలిపారు. శుక్రవారం ఇంటింటికెళ్లి పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్వో నర్సింహులు మాట్లాడుతూ అడిషనల్ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. గృహ యజమానులు, పారిశ్రామికవేత్తల వద్దకు వెళ్లి పన్ను వసూళ్ల ప్రక్రియలో వేగం పెంచామన్నారు. మున్సిపాలిటీలో రూ.16.19 కోట్ల ఉండగా రూ.10.54 కోట్లు వసూలైందన్నారు. మరో రూ.5.65 కోట్ల పన్నులు వసూలు చేయాల్సి ఉందన్నారు. శుక్రవారం నాటికి 65శాతం పన్ను వసూలు చేశామని, దీంతో పన్ను వసూళ్లలో బొల్లారం మున్సిపాలిటీ రాష్ట్రంలోనే 8వ స్థానంలో నిలిచిందన్నారు. పన్నులు చెల్లించని మొండి బకాయిదారులకు రెవెన్యూ చట్టం ప్రకారం నోటీసులు అందించి పన్నులు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ చెల్లించని పక్షంలో ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, గృహ యజమానులు ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

జిన్నారం, ఫిబ్రవరి 14: మండలంలోని పారిశ్రామిక ప్రాంతమైన ఐడీఏ బొల్లారం పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలోని మహాత్మాగాంధీ ప్రధాన రస్తా వద్ద పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఎస్సీ రూపేశ్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాలను ఆపి బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోయినా, అనుమతి పత్రాలు, లైసెన్స్ లేకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ రవీందర్ రెడ్డి, ఎస్ఐ దశరథ్ హెచ్చరించారు. టెస్టుల్లో పట్టుబడిన ఇద్దరిపై కేసులు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు శ్రీకాంత్, ప్రవీణ్, రవి పాల్గొన్నారు.

కమిషనర్‌గా వెంకట్‌రెడ్డి

కోహీర్, ఫిబ్రవరి14: కోహీర్ మున్సిపల్ కమిషనర్‌గా వెంకట్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఘట్‌కేసర్‌లో మున్సిపల్ శాఖ మేనేజర్‌గా విధులు నిర్వహించి ప్రమోషన్‌పై కోహీర్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన వెంకట్‌రెడ్డిని స్థానిక సిబ్బంది సాదరంగా ఆహ్వానించారు. జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఉమా మహేశ్వర్‌రావు నెలపాటు కోహీర్ ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

సీఎంఆర్ఎఫ్‌తో భరోసా

జహీరాబాద్, ఫిబ్రవరి 14: అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు దవాఖానల్లో చికిత్స పొందిన నిరుపేదలకు సీఎం సహాయ నిధి భరోసానిస్తుందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణంలోని ఐదో వార్డుకు చెందిన కోళ్ల లక్ష్మయ్యకు సీఆర్ఎంఎఫ్ కింద మంజూరైన రూ.2లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విశ్వేశ్వర్, దత్తాత్రి, నర్సింహులు, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడిని చంపిన అన్న

మునిపల్లి, ఫిబ్రవరి 14: భూ వివాదంలో అన్న తమ్ముడిని చంపిన ఘటన మండలంలోని చీలపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. మునిపల్లి ఎస్సై రాజేశ్‌నాయక్ కథనం ప్రకారం..గ్రామానికి చెందిన మల్కగౌని యాదయ్య తమ్ముడు శివయ్య (37)ను బండరాయితో కొట్టి చంపినట్లు ఎస్సై తెలిపారు. శివయ్య తండ్రి పేరున ఉన్న భూమిని తండ్రి చనిపోగానే అన్న యదయ్య తనపేరుపై చేసుకొని తమ్ముడికి డబ్బులు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడు. తమ్ముడు పైసలు అడుగుతుండడంతో కోపంతో అన్న యాదయ్య మద్యం మత్తులో తమ్ముడిని బండరితో కొట్టి చంపినట్లు ఎస్సై తెలిపారు. కొనఊపిరితో ఉన్న శివయ్యను కుటుంబ సభ్యులు దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రికార్డుల తనిఖీ

కోహీర్, ఫిబ్రవరి14: కోహీర్ పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ శుక్రవారం సందర్శించారు. దుకాణంలోని ఎరువుల నిల్వలు, రైతులకు విక్రయించిన ఎరువులు, మందుల వివరాలను సేకరించారు. రికార్డులు సక్రమంగా నమోదు చేయాలని డీలర్లకు సూచించారు. ఆయన వెంట ఏవో నవీన్‌కుమార్ తదితరులున్నారు.

ప్రభుత్వ భూమిగా బోర్డు

హత్నూర, ఫిబ్రవరి 14: హత్నూర మండలం కాసాల శివారులోని 336 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమిగా గుర్తించి రెవెన్యూ అధికారులు శుక్రవారం బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిని కొన్నేండ్ల క్రితం కొందరు వ్యక్తులు కబ్జా చేయడంతో గ్రామస్తుల నుంచి వచ్చిన ఫిర్యాదులకు స్పందించిన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిగా గుర్తించి బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వర్క్‌షాప్‌నకు తారా విద్యార్థులు

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 14: తారా ప్రభుత్వ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి వర్క్‌షాప్‌నకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ వెల్లడించారు. శుక్రవారం జాతీయ వర్క్‌షాప్‌నకు ఎంపికైన విద్యార్థులను, ప్రోత్సహించిన అధ్యాపకుడు మిథున్ కుమార్ రాథోడ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎంఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు అశ్విత, మౌలిష్కా ఎంపికయ్యారన్నారు. హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'జాతీయ హ్యాండ్స్ ఆన్ వర్క్ షాప్ ఆన్ టూల్స్ అండ్ టెక్నిక్స్ ఇన్ మాలిక్యూలర్ బయాలజీ' అనే అంశంపై జరిగే జాతీయస్థాయి వర్క్ షాప్‌లో పాల్గొనడం కళాశాలకే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో రమేశ్ బాబు, సదయ్యకుమార్, హెచ్ఆర్ తదితరులు ఉన్నారు.

జడ్జిని అవమానించిన ముద్దాయిని శిక్షించాలి

విధులు బహిష్కరించి కోర్టు ఆవరణలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 14: రంగారెడ్డి జిల్లా అదనపు జడ్జిపై చెప్పు విసిరి అవమానించిన ముద్దాయిని కఠినంగా శిక్షించాలంటూ శుక్రవారం నారాయణఖేడ్‌లో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ జరగని విధంగా శిక్ష పడిన నేరస్తుడు జడ్జిని అవమానించడం న్యాయ వ్యవస్థకే మాయని మచ్చ అన్నారు. ఈ సంఘటన నేపథ్యంలో రాష్ట్ర బార్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు విధులను బహిష్కరించామన్నారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌రావు, ఉపాధ్యక్షుడు భోజిరెడ్డి, ఏజీపీ సాయిలు, న్యాయవాదులు భువనేశ్వరి, సంగమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

కోహీర్, ఫిబ్రవరి14: పంటల సాగు వివరాల నమోదు కోసం చేపట్టిన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జహీరాబాద్ డివిజన్ వ్యవసాయాధికారి భిక్షపతి శుక్రవారం అధికారులను ఆదేశించారు. మండలంలోని దిగ్వాల్‌లో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ పంటల రకాలు, సాగు విస్తీర్ణం, ఎరువుల వినియోగం, పంటల దిగుబడి, తదితర వివరాలను సంబంధిత రైతుల నుంచి సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి ఏఈవో కూడా రెండు వేల ఎకరాల్లో ఉన్న పంటల వివరాలను సేకరించాలని ఏవోను ఆదేశించారు. మండలంలో లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో నవీన్‌కుమార్, ఏఈవో నాగరాణి, రైతులున్నారు.

సమావేశాలు నిర్వహించాలి

మనూరు, ఫిబ్రవరి 14:గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులతో ప్రతినెలా సమావేశాలు నిర్వహించాలని ఏపీఎం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మనూరు ఐకేపీ సమావేశ మందిరంలో మహిళా సంఘాల వీవోఏలతో ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించాలంటే సభ్యులు సమావేశాలు నిర్వహించి చర్చించాలన్నారు. కార్యక్రమంలో అకౌంటెంట్ సంజీవులు, ఆశ వర్కర్లు ఉన్నారు.

భేడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

గిరిజనుల ర్యాలీ

నారాయణఖేడ్, ఫిబ్రవరి 14: గిరిజనుల ఆరాధ్య గురువు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నారాయణఖేడ్‌లో కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహారాజ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మాఫంక్షన్ హాల్ నుంచి చేపట్టిన ర్యాలీలో గిరిజన మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, నృత్యాలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి, దేవిదాస్ మహారాజ్, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

#